క్లుప్తంగా

అధ్వానంగా పుష్కర ఘాట్‌లు



శిథిలావస్థకు చేరిన కొండాలమ్మగుడి ప్రాంత రేవు

నరసాపురం: స్థానిక గోదావరిగట్టు పొడవునా నిర్మించిన పుష్కర ఘాట్ రేవులు పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలమయ్యాయి. రూ.కోట్లు ప్రజాధనం వృథా అయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి గట్టు పొడవునా పలు చోట్ల పాతరేవుల అభివృద్ధి, కొన్నిచోట్ల కొత్తరేవులను నిర్మించారు. అయితే అప్పట్లో అవసరంలేని ప్రదేశాల్లో కూడా రేవులు నిర్మించారు. వీటి వద్దకు పుష్కరాల అనంతరం జనం వెళ్లక పోవడం, నిర్వహణ లేకపోవడంతో శిథిలమయ్యాయి. వలంధర్ రేవు, అమరేశ్వరఘాట్, లలితాంబ ఘాట్ మినహా మిగిలినచోట్ల నిర్మించిన రేవులు శిథిలమయ్యాయి. మున్సిపల్ అధికారులు కూడా మిగిలిన రేవుల మరమ్మతులు పట్టించుకోవడం లేదు.

డ్రెయిన్‌పై మూతలు లేక ఇబ్బందులు



మూతలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని ప్రధాన ప్రాంతమైన బస్టాండ్ పక్కన డ్రెయినేజీ విషయంలో మున్సిపల్ అధికారులు చూపిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఏడాది క్రితం ఈ డ్రెయిన్‌ను శుభ్రం చేశారు. డ్రెయిన్‌పై మూతలను తొలిగించి, తిరిగి మూతలను యథాస్థానంలో పెట్టలేదు. ఈ డ్రెయిన్ శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు మూతలు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల డ్రెయిన్‌కు అడ్డంగా ఎక్కడి నుంచో తీసుకొచ్చి సిమెంట్ దిమ్మెలు పెట్టారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి. ఈ ప్రాంతంలో తీవ్ర దుర్గంధం కూడా వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్‌పై మూతలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


చిట్టవరంలో ఉచిత వైద్య శిబిరం



చిట్టవరంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

నరసాపురం రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ నక్కా లక్ష్మీనారాయణ అన్నారు. చిట్టవరం గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి, నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు కాకిలేటి ఆనందకుమార్ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (విజయవాడ)కు చెందిన వైద్యులు రోగులకు బీపీ, షుగర్, ఏకోస్కాన్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాలంకి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


హోలీ సంబరాలు



ఇలపర్రులో హోలీ ఉత్సాహంలో చిన్నారులు

పెనుగొండ: హోలీ సంబరాలతో పెనుగొండ, ఆచంట మండలాల్లో హోరెత్తించారు. శుక్రవారం ఉదయం నుంచి చిన్నారులు రంగులు జిమ్ముకొంటూ ఉత్సాహంగా గడిపారు. పెనుగొండ, సిద్ధాంతం, వడలి, ఇలపర్రుల్లో చిన్నారులు వాటర్ గన్‌లతో రంగునీళ్లు జిమ్ముకొన్నారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఆచంటలో వీరభద్రుని కల్యాణం



ఆచంటలో వీరభద్రుని కల్యాణోత్సవం

పెనుగొండ: ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో వీరభద్రుని గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. గొడవర్తి భాస్కర్ శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో వీరభద్రుని కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం ప్రభ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోతకు గురవుతున్న లంక భూములు

లంకవాసుల గుండెల్లో గుబులు



భీమలాపురం వద్ద గోదావరిలోకి కోతకు గురైన లంక భూమి



నక్కావారిపాలెం వద్ద జారుతున్న లంక భూమి అండలు

పెనుగొండ: గోదావరి నీటి మట్టం పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఏటిగట్టు పొడవునా ఉన్న లంక భూములు నదిలోకి జారిపోతున్నాయి. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద ప్రారంభమైన వశిష్ఠ గోదావరి ఆచంట మండలం భీమలాపురం వరకు ఉంటుంది. గోదావరి పొడవునా ఏటిగట్టుకు ఆనుకొని లంక భూములు ఉన్నాయి. వీటితో పాటు సిద్ధాంతం మధ్యస్థ లంక, ఆచంట మండలం అయోధ్య లంక, పెదమల్లం లంక, కోడేరు పల్లెపాలెం, పుచ్చల్లంక, నకిరి తదితర లంకలు గోదావరి మధ్యలో ఉన్నాయి. ప్రతి ఏటా గోదావరికి వరద వచ్చి వెళ్లిన వెంటనే ఆయా లంకల శివారు ప్రాంతాలు గోదావరిలో అండలు అండలుగా కోతకు గురవుతూ లంకవాసుల గుండెల్లో గుబులు రేపుతుంటాయి. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా మారింది. పెనుగొండ మండలం నక్కావారి పాలెం వద్ద లంక భూముల్లో అంచులన్నీ గోదావరిలోకి జారిపోతున్నాయి. ముఖ్యంగా కొబ్బరి తోటలు గోదావరిలో కలిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నీటికి కోతకు గురైన లంకభూమి అంచుల్లో ఉన్న కొబ్బరి మొక్కలన్నీ ప్రతి ఏటా కూలిపోతూ వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

ఆచరణకు నోచుకోని రివిట్‌మెంట్

గతంలో దొంగరావిపాలెం వద్ద ఇదే పరిస్థితి నెలకొంటే గ్రోయిన్స్ కట్టి గోదావరి నీటి ప్రవాహం నేరుగా లంక భూములకు తగలకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో ఏటిగట్టు పొడవునా ప్రమాద ప్రాంతాల్లో రాతి రివెట్‌మెంట్ కట్టడానికి సైతం సన్నాహాలు చేశారు. రివిట్‌మెంట్ ఆచరణకు నోచుకోలేదు. దీంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. గత సీజన్‌లో గోదావరి ఉధృతి తీవ్రంగా ఉండడంతో లంక భూములపై ప్రభావం ఎక్కువగా ఉంది. దొంగరావిపాలెం, సిద్ధాంతం, నక్కావారి పాలెం, నడిపూడి, చినమల్లం, పెదమల్లం, కోడేరు, భీమలాపురం ప్రాంతాల్లో లంక భూములు ఎక్కువగా కోతకు గురవుతున్నాయి. ఏటిగట్టు పొడవునా కాకుండానే, గోదావరి మధ్య లంకల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నక్కిళ్లంకలో అయితే పరిస్థితి దారుణంగా ఉంది. నివాస ప్రాంతాల వద్ద కోతకు గురవుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రోయిన్స్ నిర్మాణం, రాతి రివిట్‌మెంట్ వల్ల మాత్రమే రక్షణ ఏర్పడుతుందని చెబుతున్నారు. గోదావరి హెడ్ వర్క్స్ అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ ఆర్టీఐ అధ్యక్షుడిగా బాలాజీ



పెనుగొండ: వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ ఆర్టీఐ విభాగం ఇన్‌చార్జీగా ఆచంటకు చెందిన యాళ్ల బాలాజీ నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. యాళ్ల బాలాజీ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని బాలాజీ పేర్కొన్నారు. నియామకానికి సహకరించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పుట్టింటికి రానున్న కనకదుర్గమ్మవారు

యలమంచిలి: ఉగాది ఉత్సవాలకు అడవిపాలెం గ్రామదేవత కనకదుర్గమ్మవారిని ఆదివారం ఉదయం పుట్టింటికి తీసుకురానున్నట్టు మెట్టింటి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బొలిశెట్టి రావులియ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తలు పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు, వెంకట నాగమణి దంపతులు కనకదుర్గమ్మకు సారె, చీర సమర్పించి, అమ్మవారిని పుట్టింటికి తీసుకువస్తారని పేర్కొన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం

- దాతల విగ్రహాలకు అవమానం
- శిలాఫలకంపైనా దాత పేరులేని వైనం



డయాలసిస్ సెంటర్ ప్రారంభించిన మంత్రులు, కలెక్టర్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, కలెక్టర్ సీహెచ్ నాగరాణితో కలిసి ప్రారంభించారు. ఆస్పత్రి ప్రాంగణంలో మంత్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం టిడ్కో గృహాల వద్ద నిర్మించనున్న కాలిబాట వంతెనకు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి రహదారి బంగ్లాకు వెళ్లిన మంత్రి సత్యకుమార్ బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

దాతల విగ్రహానికి, మాజీ ఎమ్మెల్సీకి అవమానం

పాలకొల్లులో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణానికి నాడు దాతలు ఇమ్మిడి సత్యనారాయణ 14.50 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలో దాతల విగ్రహాలు ఉన్నా మంత్రులు పూలమాలలు వేయకపోవడంపై మీడియా సభ్యులు ప్రశ్నించారు. దీంతో వెనక్కెళ్లి విగ్రహాలకు మంత్రులు పూలమాలలు వేశారు. డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి దాతల కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయమే ఆహ్వానం పంపడం, ప్రభుత్వాస్పత్రికి దాత ఇమ్మిడి సత్యనారాయణ పేరు పెట్టామని గొప్పలు చెప్పుకున్న మంత్రి నిమ్మల డయాలసిస్ సెంటర్‌కు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి అని నామకరణం చేయడంతో దాతల కుటుంబ సభ్యులు కొంత నొచ్చుకున్నట్టు తెలిసింది. నూతన ప్రభుత్వ ఆస్పత్రి భవనానికి దాత పేరు పెడతామని మంత్రి నిమ్మల చెప్పి తప్పించుకున్నారు. మంత్రి పక్కన నిలబడ్డ మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌ను పక్కకి లాగేయడం గమనార్హం. చిన్న బుచ్చుకున్న అంగర ప్రారంభోత్సవానికి కొద్ది దూరంగా ఉండి సమావేశానికి హాజరయ్యారు. టిడ్కో గృహాల వద్ద కాలిబాట వంతెన శంకుస్థాపనకు వెళ్లిన మంత్రి నిమ్మలకు అక్కడ ప్రజల నుంచి నిరసన వ్యక్తమయ్యే పరిస్థితి ఉండటంతో ఎవరినీ ముందుకు రాకుండా జాగ్రత్తపడ్డారు. అక్కడ మహిళలతోనూ మంత్రి మాట్లాడకపోవడం గమనార్హం.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ప్రసంగిస్తున్న వర్తమానికురాలు అంజలి

నరసాపురం రూరల్: సర్వ మానవాళికీ క్రీస్తు మార్గం అనుసరణీయమని హైదరాబాద్‌కు చెందిన వర్తమానికురాలు కె.అంజలి అన్నారు. నరసాపురం మండలం మర్రితిప్ప గ్రామంలో ఫెయిత్ చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విమోచన ఉజ్జీవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భక్తి శ్రద్ధలతో కొనసాగే కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి తృప్తి లభిస్తుందన్నారు. పాస్టర్ కె.ఎలీషా రాజు, ఎలియా, మేరి మాట్లాడుతూ ఫెయిత్ చర్చి ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రైస్తవ ఉజ్జీ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారుల ప్రదర్శనలు, గీతాలాపనలు అలరించాయి. రోగుల కోసం స్వస్థత ప్రార్థనలు, విశ్వాసాన్ని బలపరిచే సందేశాలను అందించారు.

30 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ భాస్కర్

యలమంచిలి: ఇలపకుర్రు గ్రామ సచివాలయంలో శుక్రవారం పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి సిబ్బంది ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ కొండేటి జీవరత్నం ప్రారంభించారు. డాక్టర్ పిడుగు విజయ భాస్కర్ 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. శిబిర నిర్వహణకు టెక్నీషియన్స్ మెంటే జాకీన్ బాబు, రూపా దేవి సహకారం అందించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నాట్యం



చిన్నారుల భరత నాట్యం

పెనుగొండ: సిద్ధాంతంలో విజయ గోపాల స్వామి, మాధవ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు సందర్భంగా చిన్నారుల భరత నాట్యం ఆకట్టుకొంది. గురువారం రాత్రి ఆరేళ్ల చిన్నారి కముజు నిహాన్సి భరత నాట్యం ప్రదర్శన, మిగిలిన చిన్నారుల సామూహిక నృత్యం వీక్షకులకు రంజింపజేశాయి. చిన్నారులను పలువురు అభినందించారు.

ఉద్యోగులు సంఘటితం కావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): దళిత ఉద్యోగులు సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రత్న ప్రదీప్ అన్నారు. భీమవరం బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ, భీమవరం మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.రాజ్‌కిషోర్ (తహసీల్దార్), సెక్రటరీగా ఎస్.శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.జ్యోతి, ట్రెజరర్‌గా జి.కృష్ణమోహన్, మండల అధ్యక్షుడిగా వి.రాజేష్‌కుమార్, సెక్రటరీగా కె.గౌతమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రాజేష్, ట్రెజరర్‌గా పి.సుధీర్ బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్.రాంబాబు, జి.మురళీకృష్ణ, కె.శ్రీనివాస్‌రావు, కేసీ రాజు, గంటా సుందర్‌కుమార్, ఎస్.సలీంరాజు, జె.ఏసుబాబు, ఎం.కాళి, మానస, మహంకాళి, జి.జక్కరయ్య, ఎ.లలిత కుమారి, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



దొడ్డిపట్లలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల, బూరుగుపల్లి గ్రామాల్లో శుక్రవారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది 88 ఆవులు, 214 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డాక్టర్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గుంపర్రు, ఇలపకుర్రు గ్రామాల్లో శనివారం టీకాల శిబిరం నిర్వహిస్తామని, ఆ గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

వీరభద్రుని గ్రామోత్సవం



సిద్ధాంతంలో వీరభద్ర స్వామి విగ్రహాల గ్రామోత్సవం

పెనుగొండ: సిద్ధాంతంలోని భద్ర కాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, భద్ర కాళీ సమేత వీరభద్రుడు రాతి విగ్రహాలు, ధ్వజ స్థంభాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు ఏకరూపు దుస్తులు ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కేరళ వాయిద్యాలు, ప్రత్యేక బుట్టబొమ్మల విన్యాసాలతో ఊరేగింపు కనుల పండుగగా నిర్వహించారు. ఉదయం పూజ్యం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆచంట రాము నాగమణి, ఆచంట చిన్న కస్తూరి, గుద్దటి దత్తాత్రేయకరుణ దంపతులు పూజలు చేశారు.

కనకదుర్గమ్మకు కొత్త పల్లకి



పెదమల్లంలో కనకదుర్గమ్మ కొత్త పల్లకి

పెనుగొండ: కొడమంచిలిలో కనకదుర్గమ్మవారికి కొత్త పల్లకి ఏర్పాటు చేసి పూజలు చేశారు. పాల్గుణ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కనకదుర్గమ్మవారిని కొడమంచిలి నుంచి పెదమల్లం తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. కొత్త పల్లకి పెదమల్లంలోనే మిరియాల కామేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవం నిర్వహించారు. గత కొన్నేళ్ల నుంచి అమ్మవారిని కొడమంచిలి నుంచి పెదమల్లానికి తీసుకు రావడం ఆనవాయితీగా వస్తోంది.

మామిడిశెట్టిని పరామర్శించిన ముద్దాడ



వెంకటేశ్వరావును పరామర్శిస్తున్న గణేష్ భవాని

యలమంచిలి: వైఎస్సార్ సీపీ నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం యలమంచిలి మండల యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మామిడిశెట్టి చిట్టిబాబు తండ్రి వెంకటేశ్వరావుకు ఇటీవల గుండెపోటు రావడంతో స్టంట్ వేయించుకున్నారు. ఆయన కోలుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి రావడంతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని, పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు శుక్రవారం వడ్డిలంకలో వెంకటేశ్వరరావును పరామర్శించారు. సంఘానికి ఆ కుటుంబ సభ్యులు చేసిన సేవలు, ఉద్యమానికి బాసటగా నిలిచిన తీరును గుర్తు చేసుకున్నారు. సంఘం తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సంఘ ప్రధాన కార్యదర్శి గుబ్బల వెంకన్నబాబు, దీపాటి బాబూరావు ఉన్నారు.

చిత్రావి చెరువు మునిసిపల్ పరిధిలోదేనా?



చిత్రావిచెరువు ప్రాంతం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 17వ వార్డు అచ్చుగట్లపాలెంలో ఉన్న సుమారు 11.52 ఎకరాల విస్తీర్ణం గల చిత్రావి చెరువు గట్టు చాలా వరకు ఆక్రమణలకు గురైంది. వీటిపై చెరువుపై హక్కు ఉందని చెబుతున్న వారసులు కోర్టులో కేసులు వేసి 1996 నుంచి పోరాటం చేస్తున్నారు. ఐతే ఇటీవల కోర్టులో జరిగిన వాదనల్లో చెరువు యజమాని సరైన ఆధారాలు చూపించలేకపోవడంతో కేసు కొట్టేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో చెరువు ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించిన మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి గురువారం పరిశీలన చేశారు. అయితే చెరువు వారసులు మాత్రం జిల్లా కోర్టును ఆశ్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ చెరువుకు అటువైపుగా రూరల్ పంచాయతీ ఉంది. కోర్టు కేసులతో ఈ చెరువు ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. ఐతే ఈ చెరువు మునిసిపల్ పరిధిలోదా లేక పంచాయతీ పరిధిలోదా అనే చర్చ నడుస్తోంది.

జనార్దన స్వామికి పుష్ప యాగం



పెనుగొండలో జనార్దనుని పుష్పయాగోత్సవం

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పాలకుడు జనార్దన స్వామి పుష్ప యాగోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జనార్దన స్వామికి సహస్రనామార్చనలు, బలి హరణలు, హోమాలు, గ్రామోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. లక్ష్మీ జనార్దన స్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం ఆకట్టుకొంది. ఆలయ అర్చకుడు పెద్దింటి సత్య శ్రీనివాస్, రుత్విక్కులతో పుష్పయాగం వేడుకగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సొంత గనులు కేటాయించాలి

తణుకు అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా విశాఖ ఉక్కు పరిశ్రమ కుదిరితే అమ్మకం లేదంటే ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని పరిశ్రమను కాపాడుకునేందుకు 32మంది యువత బలి అయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గుబ్బల గోపి, పీఎల్ నరసింహారావు, గోవిందరావు, ఆచంటి శ్రీరామమూర్తి, జి. వెంకటేశ్వరరావు, కిషోర్, రమణ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

యలమంచిలి: రేషన్ కార్డుదారులందరూ తమ పేరును ఈపోస్ యంత్రంలో ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులంతా రేషన్ షాపు లేదా రేషన్ వాహనం వద్ద ఈ పోస్ యంత్రంలో వేలిముద్ర వేసి, తమ పేర్లను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రంలోపు ప్రతి ఒక్కరూ తమ పేర్లను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

పక్కా డ్రెయిన్ నిర్మించండి

నరసాపురం : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. ఇది రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌లో మురుగు ముందుకు పారకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని పునర్నిర్మించాలని వారు మునిసిపల్ అధికారులను కోరుతున్నారు.

పేరిచర్లకు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ డైమండ్స్ సభ్యులకు పలు ఇంటర్నేషనల్ అవార్డులు వచ్చాయి. అలంపురం జయా గార్డెన్స్‌లో అవార్డుల ఫంక్షన్ నిర్వహించారు. జిల్లా బెస్ట్ ఆల్ రౌండర్ లయన్స్‌గా బెస్ట్ జోన్ చైర్ పర్సన్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు, డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, సెక్రటరీ మద్దుకూరి మెహర్ ప్రసాద్, డాక్టర్ కేతు కమల, బడుగు చంద్రశేఖర్, చిక్కాల అంబికా, సుస్మిత, కరిబండి రామకృష్ణలు వ్యక్తిగత అవార్డు అందుకున్నారు. గవర్నర్ కాకరాల వేణుబాబు, గట్టిం మాణిక్యాలరావు, ఎన్‌వీఎస్ పాపారావు నాయుడు, పదం కుమార్ గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

వృక్షాల నరికివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు



చెట్లు నరికిన ప్రభుత్వ స్థలాన్ని లెవెల్ చేసిన దృశ్యం



నెగ్గిపూడి ఇరిగేషన్ స్థలంలో రైతు విశ్రాంతి భవనం వద్ద వృక్షాలను నరికి వేసిన దృశ్యం



నరికిన చెట్ల దుంగలను ట్రాక్టర్‌తో బయటకు తరలిస్తున్న దృశ్యం

పెనుమంత్ర: మండలంలోని నెగ్గుపూడి గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా మార్టేరు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం (లాకులు) సమీపంలోని రైతు విశ్రాంతి భవనం పక్కన నీటిపారుదల శాఖకు చెందిన స్థలంలో కొందరు వ్యక్తులు రెండు రోజులుగా భారీ చెట్లను తొలగించి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని మార్టేరు గ్రామ ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు శుక్రవారం సాయంత్రం స్థానిక ఇరిగేషన్ అధికారితో పాటు, జిల్లా కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేశారు. లక్షలాది రూపాయలు విలువచేసే మామిడి, చింత చెట్లను తొలగించిన వారితో పాటు అందుకు సహకరించిన స్థానిక అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దీనిపై నెగ్గుపూడి ఇన్‌చార్జి వీఆర్వో పి.మల్లేశ్వరరావు వివరణ కోరగా తహసీల్దార్ నుంచి అందిన మౌఖిక ఆదేశాల మేరకు ఆ స్థలం ఇరిగేషన్‌కు చెందినదిగా గుర్తించి, ఆ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. మార్టేరు సెక్షన్ ఇరిగేషన్ ఏఈ జి.జయశంకర్ ను వివరణ కోరగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి తమ స్థలం ఎక్కడికి ఉందో గుర్తిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసు పెడతామని తెలిపారు.